క్లుప్తంగా

వైభవంగా మారు జాతర



ఆలయం బయట పూజలు చేస్తున్న భక్తులు

రాజాం: స్థానిక పట్టణంలోని బొబ్బిలి రోడ్డులో కొలువైన పోలిపల్లి పైడితల్లి అమ్మవారి మారు జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ఆలయ 99వ జాతర మహోత్సవాలు నిర్వహించగా, ఎప్పటి లాగే ఇప్పుడు మారు జాతర జాతర చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

తెర్లాం: మండల కేంద్రంలో గ్రామదేవత హేమాలమ్మ(చిన్నమ్మ) వారాల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి, విశేష పూజలు చేశారు.

బొబ్బిలి: పట్టణంలోని బైపాస్ రోడ్డులో కొలువైన దాడితల్లి అమ్మవారికి మంగళవారం సుప్రభాతార్చన, ప్రత్యేక పూజలు చేశారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయండి

బొబ్బిలి: పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. స్థానిక పట్టణంలో తానే స్వయంగా పన్నుల వసూళ్లకు మంగళవారం బయలుదేరి వెళ్లారు. పలువురి నుంచి పన్నులు వసూలు చేశారు. మధ్యాహ్నం నాటికి మొత్తం రూ.60 వేలు వసూలు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

400 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదానం చేస్తున్న యువత

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో మొత్తం 400 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్‌లు మాట్లాడుతూ రక్తదానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని, రక్తదానం సామాజిక బాధ్యత కావాలన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలు వీడాలని, రక్తం దానం చేస్తే ఆరోగ్యమే తప్ప నష్టమేమీ లేదన్నారు. ఒకరి రక్తం ద్వారా ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, డాక్టర్ వి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫారంపాండ్‌లతో భూగర్భజలాల సంరక్షణ



వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా చేపడుతున్న ఫారంపాండ్‌ల నిర్మాణంతో భూగర్భజలాలు సంరక్షించుకోవచ్చని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని పిన్నవలస గ్రామంలో చేస్తున్న ఫారంపాండ్‌ల నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. నిర్దేశిత కొలతల్లో ఫారంపాండ్‌లు ఏర్పాటు చేయాలని, ఈ ఆర్థిక సంవత్సరానికి 259 నిర్మాణాలు లక్ష్యంగా చేసుకున్నామన్నారు.

బెల్లం తయారీలో రసాయనాలు వాడొద్దు



బెల్లం తయారీని పరిశీలిస్తున్న ఏడీఏ శ్యామసుందర్

బొబ్బిలిరూరల్: రంగు, రుచి కోసం బెల్లం తయారీలో రసాయనాలు వాడవద్దని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.శ్యామసుందర్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెంట గ్రామంలో బెల్ల తయారీ కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించి, బెల్లం తయారీని అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. సంప్రదాయ పద్ధతుల ద్వారా బెల్లం తయారు చేస్తేనే రుచి, ఆరోగ్యమని, రసాయనాలు వినియోగించి తయారు చేస్తే కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రావచ్చన్నారు.

- ప్రమాదకరంగా నియోజకవర్గ రోడ్లు
- మలుపుల వద్ద కానరాని హెచ్చరిక బోర్డులు
- ప్రమాదాల బారినపడుతున్న వాహనదారులు
- ఏడాది కాలంలో 58కి పైగా దుర్ఘటనలు

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు!



ప్రమాదాలకు నెలవుగా మారిన వంగర మండలంలోని కాగితాపల్లి-రాజాం రోడ్డు



రాజాం-ఒమ్మి గ్రామాల మధ్య కంచరాం వద్ద ప్రమాదకరంగా రోడ్డు మలుపు



రాజాం-పొగిరి గ్రామాల మధ్య మొగిలివలస సమీపంలోని మలుపు ఇలా..

రాజాం: నియోజకవర్గంలోని పలుచోట్ల రోడ్డు మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. రహదారి వంపు ఎక్కువగా ఉండడంతో అనుకోని ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో చాలామంది మృత్యువాత పడడమే కాకుండా భారీ సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారు. మితిమీరిన వేగం, మలుపు దగ్గర కూడా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వంటివి ప్రమాదాలకు ఓ కారణమైతే.. మలుపుల వద్ద ప్రమాదాల నియంత్రణకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం మరో కారణం. కొంతదూరంలో మలుపు ఉందనగా వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్‌బోర్డులు లేదా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం అటువంటి చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. ఫలితంగా ప్రమాదాలు జరగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

రాజాం నియోజకవర్గంలో నియోజకవర్గ కేంద్రం నుంచి రేగిడి, వంగర, సంతకవిటి మండలాలతో పాటు అటు తెర్లాం, ఇటు చీపురుపల్లి, మరో వైపు జి.సిగడాం వెళ్లే రోడ్లన్నీ ఇరుకుగా, ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. ఎప్పటికప్పుడే ప్రమాదాలు జరుగుతున్నా.. ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, డేంజర్ సిగ్నల్స్ ఇచ్చే బిన్‌లు, స్టాపర్‌లు ప్రస్తుతం కానరావడం లేదు.

మృత్యుమార్గాలు..

రాజాం నుంచి వంగర మండలం వెళ్లే దారిలో కాగితాపల్లి, అరసాడ గ్రామాల మలుపులు అత్యంత ప్రమాదకరం. ఇక్కడ అత్యధికంగా ఆటో, బైక్ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజాం నుంచి రేగిడి వెళ్లే రోడ్డులో బూరాడ దాటిన తర్వాత శిర్లాం, మజ్జిరాముడుపేట గ్రామాల వద్ద మలుపులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాజాం నుంచి సంతకవిటి వెళ్లే దారిలో గుళ్లసీతారాంపురం, రంగారాయపురం, బొద్దూరు గ్రామాల వద్ద మలుపులు నిత్యం ప్రమాదాలు జరిగే కూడళ్లుగా మారాయి. రాజాం నుంచి ఒమ్మి వెళ్లే రహదారిలో కంచరాం, రాజయ్యపేట గ్రామాల వద్ద రోడ్లు మృత్యుమార్గాలుగా మారాయి. ఇటీవల ఇక్కడ రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. రాజాం నుంచి చీపురుపల్లి వెళ్లే రహదారిలో బొద్దాం-గారాజు చీపురుపల్లి గ్రామాల వద్ద జెండాలదిబ్బ.. ప్రమాదాలు అత్యధికంగా జరిగే ప్రాంతంగా రికార్డులో నమోదైంది. రాజాం నుంచి పొగిరి వెళ్లే రహదారిలో అంతకాపల్లి, మొగిలివలస గ్రామాల వద్ద మలుపులు యమలోకానికి పిలుస్తున్నట్లుగా ఉన్నాయి. గతంలో ఈ ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు, స్టాపర్లు, డేంజర్ సిగ్నల్స్, ఐరన్‌టిన్‌లు ఉండేవి. వాటిని చూసి వాహన చోదకులు జాగ్రత్త పడేవారు. ప్రస్తుతం ఇవి ఎక్కడా కనిపంచడం లేదు. గతంలోని పెట్రోలింగ్ పోలీస్ విధానం గతంలో ఉన్నంత యాక్టివ్‌గా ఇప్పుడు లేకపోవడం, మద్యం బెల్టుషాపులు అధికమవడంతో మందుబాబులు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

అధిక లోడు వాహనాలూ కారణమే..

నియోజకవర్గంలో గడిచిన 11 నెలల వ్యవధిలో 58కి పైగా రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయి. ఇవి అధికారికంగా ఉన్న లెక్కలు. అనధికారికంగా జరిగిన దుర్ఘటనలు, రాజీ పడిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఇవన్నీ కూడా రోడ్డు మలుపుల వద్ద జరుగుతున్నవే. అతివేగంతో పాటు ఈ మలుపుల వద్ద నిబంధనలు ఉల్లంఘించి అధిక లోడుతో వెళ్తున్న వాహనాలే ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ద్విచక్ర వాహనంపై ముగ్గురేసి ప్రయాణించడం, ఆటోల్లో 12 మందికి పైగా ప్రయాణికులతో నడపడం, ప్రయాణికుల ఆటోల్లో లగేజీ తీసుకెళ్తుండడంతో తరచూ దుర్ఘటనలు జరుగుతున్నాయి. రాజాం పట్టణ, మండల పరిధిలో 28, సంతకవిటి పరిధిలో 9, రేగిడి మండల పరిధిలో 13, వంగర మండల పరిధిలో 8 కేసులు రోడ్డు ప్రమాదాలుగా నమోదయ్యాయి.

చర్యలు తీసుకుంటున్నాం..

ప్రమాదకరంగా ఉన్న రోడ్ల మలుపుల వద్ద ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఆ ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయిస్తున్నాం. పలుచోట్ల ఇప్పటికే తుప్పలు, డొంకలు తొలగించాం. గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు పోయాయి. ఇప్పుడు మళ్లీ కొత్తగా ఏర్పాటు చేయాల్సి ఉంది.

– హెచ్.ఉపేంద్ర, రాజాం రూరల్ సీఐ



ప్రమాదకరంగా రేగిడి మండలం, బూరాడ రోడ్డు మలుపు



సంతకవిటి మండలంలోని గుళ్లసీతారాంపురం-తాలాడ గ్రామాల మధ్య రోడ్డు మలుపు

'ఉపాధి' కల్పనలో వివక్ష తగదు

- ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన బూరాడపేట గ్రామస్తులు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న వేతనదారులు

రాజాం సిటీ: ఉపాధి హామీ పథకం పనులు కల్పించడంలో వివక్ష చూపుతున్నారని మండలంలోని బొమ్మినాయుడువలస పంచాయతీ, బూరాడపేట వేతనదారులు వాపోతున్నారు. ఇదే విషయమై వారంతా స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి మంగళవారం వెళ్లి, ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులమని పనులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలుగా పనులు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పనులు కల్పించాలని ప్రాధేయపడితే వారం రోజుల క్రితం పనులు కల్పించి, రెండు రోజులకే పరిమితం చేశారన్నారు. ఎందుకిలా చేస్తున్నావని ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిలదీస్తే గ్రామంలో పనులు లేవు.. మీ దిక్కున్న చోట చెప్పుకోండి అని అంటున్నాడని అన్నారు. వాస్తవానికి మేట్‌ల నియామకానికి ఎన్నిక జరగాల్సి ఉండగా, అలా చేయకుండా తన చేతివాటంతో నిబంధనలకు విరుద్ధంగా మేట్‌ను కూడా ఫీల్డ్ అసిస్టెంట్ మోహనరావు మార్చాడని ఆరోపించారు. గ్రామంలోని 50 మందికి పనులు కల్పించడం లేదన్నారు. ఇంతటి వివక్ష చూపడం సరికాదని, తక్షణమే పనులు కల్పించి తమను ఆదుకోవాలని వారంతా కోరారు. అంతకుముందు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఏపీవో కె.సాయిరాం వద్ద తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ మోహనరావును వారు ఆదేశించారు. పనులు కల్పించకపోతే ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పీఎంఏవై గృహ నిర్మాణదారులకు ఆర్థికసాయం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏఈ వేణుగోపాలనాయుడు

తెర్లాం: పీఎంఏవై(ప్రధానమంత్రి ఆవాస్ యోజన) పథకం కింద ఇళ్లు నిర్మించి, అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనంగా చెల్లించనున్న సాయాన్ని లబ్ధిదారులంతా వినియోగించుకోవాలని మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ రెడ్డి వేణుగోపాలనాయుడు కోరారు. స్థానిక జగనన్న కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఆయన మంగళవారం పరిశీలించారు. నిధులు చాలకపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే ఉండిపోవడం చూసి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికసాయానికి ముందుకు వచ్చిందన్నారు. బీసీ, ఎస్సీల ఇళ్లకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అందిస్తుందన్నారు. ఆయన వెంట తెర్లాం ఎంపీటీసీ జి.ఆనందరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సారా నియంత్రణకు సహకరించండి

వంగర: సారా రహిత గ్రామాలే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని రాజాం ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ అన్నారు. నవోదయం 2.0 పేరిట మండలంలోని కోదులగుమ్మడ గ్రామంలో సారా నిర్మూలనపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సారాను నిర్మూలిద్దాం.. గ్రామాన్ని ప్రగతిబాట పట్టిద్దామని ఆయన పిలుపునిచ్చారు. సారా తయారీ, రవాణా నేరమని, ఎక్కడైనా సారా విక్రయాలు జరిగితే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమాజంలో సారా అనే పెనుభూతం లేకుండా చేసేందుకు గ్రామస్తులంతా సహకరించాలని కోరారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300



రేగిడి: తోకలవలసలో ఉపాధి పనుల్లో వేతనదారులు



రాజాం సిటీ: ఒమ్మిలో ఫారంపాండ్‌ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏపీవో సాయిరాం

రేగిడి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అవుతుందని ఏపీవో హరనాధరావు తెలిపారు. మండలంలోని తోకలవలస, లచ్చనవలస, తాటిపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. గతంలో మాదిరి ఉపాధి పనులు చేసుకుంటే వేతనదారులకు సరైన వేతనం రావడం కష్టమని, తోటల్లో ఫాంరంపాండ్‌లు, కందకాల తవ్వకాలు వంటి పనులు చేస్తే కనీస వేతనం లభిస్తుందన్నారు.

రాజాం సిటీ: మండలంలోని కంచరాం, ఒమ్మి గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులు, ఫారంపాండ్‌ల నిర్మాణాలను ఏపీవో సాయిరాం మంగళవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు పరిశీలించి, రెండు పూటలా కొలతల ప్రకారం పనులు చేయాలని తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



రామభద్రపురం: మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న షిర్డీసాయిబాబా ఆలయం ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులు పెదపల్లి రాము, పెదపల్లి రామకృష్ణల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం మంగళవారం ఏర్పాటు చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఇలా తమవంతు సేవ చేస్తున్నామని వారు తెలిపారు. ఒకరోజు మంచినీరు, మరోరోజు మజ్జిగను అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

తెర్లాం: వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని తహసీల్దారు జి.హేమంత్ కుమార్ కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో మంగళవారం సాయంత్రం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కలెక్టరు ఆదేశాల మేరకు అన్ని తహసీల్దారు కార్యాలయాల వద్ద ఈ తరహా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని తహసీల్దారు తెలిపారు. ఆయన వెంట హెచ్‌డీటీ సత్యనారాయణ, మండల సర్వేయరు సాయి, ఆర్‌ఐ కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలి

రేగిడి: చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. మండలంలోని వండానపేట, కేఎంవలస, ఉంగరాడమెట్ట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు చూసి, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం మెరుగుపరచాలని, ఆ దిశగా తల్లిదండ్రులకు సూచనలు చేయాలన్నారు.

సర్వేల్లో బాడంగి ప్రథమ స్థానం

బాడంగి: ప్రభుత్వం చేయిస్తున్న సర్వేల్లో బాడంగి మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పీ4, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేల్లో జిల్లాలోనే మండలం ప్రథమ స్థానం సంపాదించిందన్నారు. పీ4 సర్వే 99.2 శాతం మేర జరిగిందన్నారు. సర్వేకు సహకరించిన ప్రజలు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగోన్నతి

బాడంగి: మండలంలో గ్రేడ్-4, 5 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న ఇద్దరికి గ్రేడ్-3, 4 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి లభించిందని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మంగళవారం తెలిపారు. బొత్సవానివలస పంచాయతీలో గ్రేడ్-4 కార్యదర్శిగా పనిచేస్తున్న పి.మహేశ్వరరావుకు వాడాడ పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శిగాను, పూడివలస పంచాయతీ గ్రేడ్-5 కార్యదర్శిగా పనిచేస్తున్న బి.అప్పలనాయుడుకు దత్తిరాజేరు మండలం, రాజులరామచంద్రాపురం గ్రేడ్-4 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి లభించినట్లు పేర్కొన్నారు. వారిద్దరికీ లిఖిత పూర్వక రిలీవింగ్ ఆదేశాలిచ్చామన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని నందబలగ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ప్లాంట్ సక్రమంగా పనిచేస్తుందా, లేదా అని హెచ్‌ఎం ఈశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల రికార్డులు, విద్యార్థుల హోమ్ వర్కు పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. ఆ తర్వాత వివిధ ప్రశ్నలడిగి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేశారు.

గ్రామసభ

సంతకవిటి: మండలంలోని కావలి గ్రామంలో భూముల రీసర్వేపై గ్రామసభ మంగళవారం నిర్వహించారు. సర్వే సమయంలో ప్రతి రైతు తమ పొలం వద్దనే ఉండి, పొలం చూపించి మరీ సర్వే చేయించుకోవాలని తహసీల్దార్ బి.సత్యం తెలిపారు. సర్వే జరిగేటపుడు ప్రతి రైతుకు నోటీసులు ఇస్తామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు



ఆరికతోట పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

రామభద్రపురం: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సురక్షితమైన సాధారణ ప్రసవాలు జరుగుతాయని డీఎంహెచ్‌వో జీవనరాణి తెలిపారు. మండలంలోని ఆరికతోట, రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రుల నిర్వహణకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అలాగే ఓపీ వివరాలు, ప్రసవాలు ఎలా జరుగుతున్నాయి, సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై వైద్యాధికారులు దిలీప్‌కుమార్, అపర్ణలను రాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ఆస్పత్రిలో సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజు, ఈవో మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ బిల్లుల దహనం





పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బొబ్బిలిలోని పాకి వీధి ప్రజలు మంగళవారం నిరసనకు దిగారు. సీఐటీయూ(సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక బిల్లు వచ్చిన కరెంట్ బిల్లు కాగితాలను దహనం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్ చార్జీలు పెంచుకుంటూ పోతోందని, దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు కూలీయే రూ.400 నుంచి రూ.500 వస్తున్నప్పుడు నెల కరెంట్ బిల్లు రూ.700, రూ.800, రూ.1000 వస్తే ఎలా కట్టాలని ప్రశ్నించారు. ఒక్కోసారి కరెంట్ బిల్లు కట్టేందుకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరారు. ఎం.బూర్జివలస గ్రామంలో సీపీఎం ప్రజాచైతన్య యాత్రలో ట్రూ అప్ చార్జీలు రద్దు కోరుతూ గ్రామస్తులు కరెంట్ బిల్లులను దహనం చేశారు.

– బొబ్బిలి, బొబ్బిలిరూరల్

ఇంటి స్థలం ఆక్రమణపై విచారణ



తన ఇంటి స్థలం ఆక్రమించి పునాదులు వేస్తున్నారని మండలంలోని గంగన్నపాడుకు చెందిన గొల్ల సంధ్య.. గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దారు హేమంత్‌కుమార్, మండల సర్వేయరు సాయి, ఆర్‌ఐ కృష్ణమూర్తిలు ఆ గ్రామానికి మంగళవారం వెళ్లి, విచారణ చేపట్టారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి, రికార్డుల ఆధారంగా ఫిర్యాదుదారు, ఆక్రమణదారుడి స్థలాలను కొలిచి చూశారు. ఇంటి స్థలం ఆక్రమణకు గురికాలేదని, అవతలి వ్యక్తి వేసిన పునాది స్థలం గ్రామకంఠమని తేల్చారు. అనంతరం ఇరువురి స్థలాల హద్దులు గుర్తించి, ఎవరి స్థలం వారికి చూపించారు.

– తెర్లాం

ఘనంగా పునీత జోజప్ప జయంత్యుత్సవం



బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని పాతబొబ్బిలిలో పునీత జోజప్ప జయంత్యుత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పవిత్ర గ్రంథం బైబిల్ అనుసారం ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన తండ్రిగా జోజప్ప వెలుగొందుతున్నారు. ఈ నేపథ్యంలో బాలయేసును జోజప్ప ఎత్తుకున్నట్లు ఉన్న విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. ఏసుప్రభువును స్తుతిస్తూ ఆరాధన, గీతాలాపనలు చేశారు. అనంతరం పునీత జోజప్ప గూర్చి మతవిశ్వాసకులకు వివరించారు. లోక రక్షకుడైన క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదం చేస్తాయని, అందరూ అనుసరించాలని ఫాదర్‌లు కోరారు.

– బొబ్బిలి